సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం । 19 । మే । 2023



డ్రగ్స్ ముఠా సభ్యుడి అరెస్ట్

అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా సభ్యుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర తెలిపారు. - 8లో



బుద్ధవనం.. నందనవనం

బుద్ధవనం నందనవనమని మయన్మార్ దేశ మత వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
40° / 27°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ధాన్యం దిగుమతిలో జాప్యం చేయొద్దు

భువనగిరిటౌన్ : రైస్ మిలర్లు తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేసుకుని జాప్యం తలెత్తకుండా ఎప్పటికప్పుడు ధాన్యం దిగుమతి చేసుకోవాలని సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇప్పటి వరకు 325 కేంద్రాల ద్వారా 1,76లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. తాలు, తరుగు పేరుతో మిల్లర్ల నుంచి ఎదురవుతున్న సమస్యలు, రవాణా, గన్నీ బ్యాగుల సరఫరా, ట్యాబ్ ఎంట్రీ, ధాన్యం చెల్లింపులు తదితర సమస్యలకు పరిష్కారం చూపడానికి టోల్ ఫ్రీ నంబర్ 7991520554 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఏ సమస్య ఎదురైనా టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలి



మాసాయిపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

యాదగిరిగుట్ట రూరల్ : ధాన్యం కొనుగోలు చేసిన రైతులకు జాప్యం జరగకుండా బిల్లులు చెల్లించాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట మండలం గౌరాయపల్లి, మాసాయిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం తూకం వేసిన తర్వాత రైతుల వివరాలు ఎప్పటికప్పుడు టాబ్‌లో నమోదు చేయాలన్నారు. అదే విధంగా గౌరాయపల్లిలోని కంటివెలుగు శిబిరాన్ని, మాసాయిపేటలో నర్సరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఎంపీడీఓ కారం ప్రభాకర్‌రెడ్డి, డీపీఎం సునీల్ రెడ్డి మెడికల్ ఆఫీసర్ వంశీక్రిష్ణ, పీఏసీఎస్, ఐకేపీ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు



జోడు సేవలను ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో గురువారం నిత్య పూజలు విశేషంగా కొనసాగాయి. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరచిన ఆచార్యులు శ్రీస్వామి వారికి సుప్రభాతం, ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఇక ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవోత్సవం, సహస్రనామార్చన గావించారు. రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం, జోడు సేవలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

రంగు మారిన వడ్లను ప్రభుత్వమే కొనాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

గుండాల : అకాల వర్షాలకు తడిసి రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. గురువారం గుండాల మండలంలోని అనంతారంలో నిర్వహించిన పార్టీ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లర్లు తరుగు పేరుతో తూకం వేసిన ధాన్యంలో కోత విధిస్తున్నారని, రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. అలాగే రైతులకు లక్ష రూపాయలు రుణమాఫీ చేయాలని, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు పరిహారం అందజేయాలని కోరారు. జూన్ 4న కొత్తగూడెంలో నిర్వహించనున్న లక్ష జనాల సమీకరణ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఆదిసాయిలు, నాయకులు మోహన్‌రెడ్డి, వెంకటయ్య, బక్కయ్య, స్వామి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

● ప్రశాంతంగా ఎడ్‌సెట్



నల్లగొండలోని ఎస్‌పీఆర్ స్కూల్‌లో గురువారం ఎడ్‌సెట్‌కు హాజరైన అభ్యర్థుల హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు

పంట ప్రణాళిక ఖరారు

వానాకాలం 4,91,260 ఎకరాల్లో సాగు అంచనా

- గత ఏడాది కంటే అధికం
- వరి 3.29 లక్షలు, పత్తి 1.21 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం
- ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తున్న యంత్రాంగం

సాక్షి, యాదాద్రి : వానాకాలం పంటల సాగు ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా 4,91,260 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేసింది. రైతుల అవసరం మేరకు ఎరువులు, విత్తనాలను సమకూర్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు సంబంధించి ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.



భువనగిరి వద్ద దుక్కి దున్నుతున్న రైతు

పంటల సాగు ఇలా..

జిల్లాలోని 92 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో అన్ని రకాల పంటలు కలిపి 4,91,260 ఎకరాల్లో సాగవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా వరి 3,29,066 ఎకరాలు, పత్తి 1,21,471, కంది 9,298, ఇతర పంటలు 31,426 ఎకరాల్లో సాగవుతాయని అంచనాలు రూపొందించారు. గత వానాకాలం కంటే ఈసారి అధనంగా పంటలు సాగు కానున్నాయి.

దుక్కులు దున్నుతున్న రైతులు

సాధారణంగా రైతులు రోహిణి కార్తెలో సాగు ప్రారంభిస్తారు. ఈ కార్తెలో విత్తనాలు వేస్తే మంచి దిగుబడి వస్తుందని నమ్మకం. ఈనెల 25నుంచి రోహిణి కార్తె మొదలుకానుండడంతో రైతులు దుక్కులు దున్నే పనిలో నిమగ్నమయ్యారు. మూసీ ఆయకట్టులో నార్లు పోయడం, దమ్ము చేయడం వంటి పనులకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఎరువులు, విత్తనాల కోసం ప్రభుత్వానికి నివేదిక

సాగు అంచనాలకు అనుగుణంగా ఎరువులు, విత్తనాల కోసం వ్యవసాయ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. గతంలో మాదిరి కాకుండా సీజన్ మొదలుకొని సీజన్ ముగిసే వరకు నెలకు ఏ మేరకు అవసరం ఉంటాయో అంచనా వేసి ప్రణాళికలు రూపొందించారు. వరి 82,267 క్వింటాళ్లు, పత్తి 2,42,942 ప్యాకెట్ల విత్తనాలు అవసరం ఉంటాయని లెక్కగట్టారు. వీటితో పాటు కంది, జొన్న, పెసర, నువ్వులు ఇతర విత్తనాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేశారు.

సాగు విస్తీర్ణం ఇలా..

సీజన్	వరి	పత్తి	కంది	ఇతర	మొత్తం
గత వానాకాలం	2,99,151	8,452	28,569	28,5,69	4,46,600
యాసంగి	2,90,908	--	--	19,223	3,10,131
ఈ వానాకాలం	3,29,066	1,21,471	9,298	31,426	4,91,260

కావాల్సిన ఎరువులు (మెట్రిక్ టన్నులు)

ఎరువు	అవసరం
యూరియా	22,635
ఎంఓపీ	3,874
డీఏపీ	12,684
కాంప్లెక్స్	18,495
మొత్తం	57,688

ఫిష్ ఫ్రై, ఫిష్ కర్రీ, ఫిష్ బిర్యానీ..

భువనగిరిలో ఫుడ్ ఫెస్టివల్

- జూన్ 7,8,9 తేదీల్లో నిర్వహణ
- ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాట్లు
- వంటకాల తయారీకి 30 మందికి శిక్షణ



భువనగిరిటౌన్ : ఫిష్ ఫ్రై, ఫిష్ కర్రీ, ఫిష్ బిర్యానీ.. ఇలా ఒక్కటేమిటి పది రకాల చేపల వంటకాలు నోరూరింపజేయనున్నాయి. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహణకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే నెల మృగశిరకార్తె సందర్భంగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో 7,8,9 తేదీల్లో మూడు రోజుల పాటు భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ ఫెస్టివల్ నిర్వహించనున్నారు.

10 రకాల వంటకాలు

స్వయం ఉపాధి పొందే విధంగా అన్ని జిల్లాల మహిళా మత్స్యకారులకు చేపలతో వివిధ రకాల వంటకాల తయారీపై ఇప్పటికే హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. ఇందులో యాదాద్రి జిల్లాకు చెందిన వారు 30 మంది ఉన్నారు. వీరి భాగస్వామ్యంతో భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 10 రకాల చేపల వంటకాలతో స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ వంటకాలను చాలా తక్కువ ధరకు విక్రయించనున్నారు.

పండగ వాతావరణంలో కార్యక్రమాలు

ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌కు హాజరయ్యే వారికి నోరూరించే పది రకాల చేపల వంటకాలతో పాటు వినోదాన్ని పంచేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఫెస్టివల్ నిర్వహణకు జిల్లాకు రూ.3 లక్షలు ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఈ ఫెస్టివల్‌లో జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు.

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి..

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనేక కార్యక్రమాలు చేపడుతోంది. తాజాగా చేపల వంటకాలను ప్రజలకు పరిచయం చేసి చేపల వినియోగాన్ని మరింతంగా పెంచి తద్వారా మత్స్యకారుల ఆర్థిక పురోగతికి దోహదపడాలన్నది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో మృగశిరకార్తెకు ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ నిర్ణయించింది.

ఏర్పాట్లు చేస్తున్నాం



ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ కోసం ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం అయితే పది రకాల వంటకాలు చేయాలని అనుకుంటున్నాం. శిక్షణ పొందిన వారి ఆసక్తిని బట్టి మరికొన్ని వంటకాలు పెంచుతాం వంటకాలకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మూడు రోజులు కార్యక్రమాలు ఉంటాయి.

–రాజారాం, మత్స్యశాఖ జిల్లా అధికారి

హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

భువనగిరిటౌన్ : ఎస్సీ స్టడీ సర్కిల్ నల్లగొండ వారి ఆధ్వర్యంలో ఇచ్చే ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పరీక్ష రాసేందుకు ఈ నెల 18నుంచి వెబ్‌సైట్‌లో హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ అధికారి జైపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. 2023 – 24వ విద్యా సంవత్సరానికి గాను ఐదు నెలల పాటు ఫౌండేషన్ కోర్సుల్లో భాగంగా బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, స్టేట్ సర్వీసెస్ పరీక్షలకు ఉచితశిక్షణకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. 100 మందిని ఎంపిక చేస్తామన్నారు. అభ్యర్థులు tsstudycircle.co.in లో హాల్ టికెట్‌లు డౌన్ చేసుకోవాలని కోరారు.

కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుంది

● డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి : కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుతో కేసీఆర్‌కు ఓటమి భయం పట్టుకుందని, రాష్ట్రంలో బీఆర్ఎస్ పతనం మొదలైందని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం భువనగిరిలోని రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేలను నియోజకవర్గాల్లో తిరిగి చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించాలని సీఎం కేసీఆర్ వారికి చెబుతున్నాడని, చేయని అభివృద్ధి గురించి ఏం చెబుతారని ప్రశ్నించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల, దళితులకు మూడు ఎకరాల భూమి, నిరుద్యోగ భృతి వంటి హామీలను విస్మరించారని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం జరుగుతుందని, ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లు చూస్తుంటే ఇంకా రెండు నెలలైనా సమయం పట్టే అవకాశం ఉందన్నారు. తరుగు తీయకుండా వడ్లు కొనుగోలు చేయాలని, లేకుంటే రైతుల పక్షాన ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. మిల్లర్లు రైతులను దగా చేయవద్దన్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధి నుంచి వెళ్తున్న రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేయడంలో అలస్యమైందన్నారు. ఈ విషయమై కాంగ్రెస్ ఇప్పటికే తీర్మానం చేసిందన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే మేల్కొని సీఎం వద్ద అలైన్‌మెంట్ మార్పునకు కృషి చేయాలని, రాయగిరి రైతులకు ఎంత నష్ట పరిహారం ఇస్తారో తేల్చాలని డిమాండ్ చేశారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

2న రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్

తెలంగాణ యువత కోసం కాంగ్రెస్ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ నిర్వహించనున్నట్లు అనిల్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. రిజిస్ట్రేషన్ కోసం 7661899899 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. 16 నుంచి 35 ఏళ్ల వయస్సున్నవారు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి 1 చివరి తేదీ అన్నారు. విజేతలకు నియోజకవర్గానికి మూడు బహుమతులు అందజేస్తామన్నారు. ప్రథమ ల్యాప్‌టాప్, ద్వితీయ స్మార్ట్‌ఫోన్, తృతీయ బహుమతిగా ట్యాబ్‌లు ఇస్తామన్నారు. వీటితో పాటు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. వివరాల కోసం 8142903456 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. విలేకర్ల సమావేశంలో టీపీసీసీ సభ్యుడు తంగెళ్లపల్లి రవికుమార్, పట్టణ అధ్యక్షుడు బీసుకుంట్ల సత్యనారాయణ నాయకులు బర్రె జహంగీర్, నూతి రమేష్, చెరుకు అచ్చయ్య, జనగాం ఉపేందర్‌రెడ్డి, చల్లగురుగుల రఘుబాబు తదితరులు ఉన్నారు.

తగ్గని భగభగలు

భువనగిరిటౌన్ : భానుడి భగభగలు తగ్గడం లేదు. ఎండ తీవ్రతకు జనం బెంబేలెత్తిపోతున్నారు. అత్యవసరం అయితే తప్ప.. ఇళ్లనుంచి బయటకు రావడం లేదు. ప్రయాణాలు వాయిదా వేసుకుంటున్నారు. జిల్లాలో గురువారం అత్యధికంగా వలిగొండలో 42.5 డిగ్రీలు, ఆ తర్వాత ఆత్మకూర్(ఎం) మండలంలో 42.4 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

విద్యుత్ సరఫరాలో అంతరాయం.. ఉక్కపోతతో అల్లాడిన జనం

ఎండ తీవ్రతకు ఉక్కపోత తోడవడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నాడు. ఎండ తీవ్రత కారణంగా ఏసీలు, కూలర్ల వాడకం పెరిగింది. దీంతో విద్యుత్ వినియోగం పెరిగింది. గురువారం భువనగిరి పట్టణంలోని పలు ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. తరచు వచ్చిపోతుండడం, మరో వైపు ఎండ, ఉక్కపోత కారణంగా జనం విలవిలలాడారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఎక్కువగా జనరేటర్ల మీదనే ఆధారపడ్డారు.



చెత్త సమస్యకేదీ పరిష్కారం!

- మోత్కూరు డంపింగ్ యార్డులో గుట్టలుగా వ్యర్థాలు
- ఆరు నెలల కిత్రం బయోమైనింగ్ ప్రారంభం
- ఇప్పటికీ మొదలుకాని పనులు
- దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు

మోత్కూరు : మోత్కూరు మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో ఆరు నెలల క్రితం బయోమైనింగ్ ప్రారంభించినా ఇంకా పనులు మొదలు కావడం లేదు. లూర్దునగర్ కాలనీ వెనుకభాగంలో 947 సర్వే నంబర్‌లో నాలుగు ఎకరాల స్థలంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను ఏరోజుకారోజు యార్డుకు తరలిస్తుంటారు. చెత్త వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుద్ధి చేసి సేంద్రియ ఎరువుగా మార్చేందుకు 2022 నవంబర్ 11న కేరళకు చెందిన సాగర్ మోటార్స్ ఏజెన్సీ ఆధ్వర్యంలో బయోమైనింగ్ ఏర్పాటు చేశారు. కానీ, పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది.

రోజూ 5 మెట్రిక్ టన్నుల చెత్త సేకరణ

మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల పరిధిలో 5,089 వరకు నివాస గృహాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వీటి నుంచి రోజూ ఐదు మెట్రిక్ టన్నుల తడి, పొడి చెత్త వెలువడుతోంది. పారిశుద్ధ్య సిబ్బంది సేకరించిన చెత్తను ఏరోజుకారోజు డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. బయోమైనింగ్ పనులు కొనసాగకపోవడంతో చెత్త వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. చెత్త, వ్యర్థాల నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నామని లూర్దునగర్ కాలనీవాసులు వాపోతున్నారు.



డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త

వినియోగంలోకి తెస్తే అదనపు ఆదాయం

బయోమైనింగ్ ద్వారా వచ్చిన ఎరువును పంట పొలాలకు, ప్లాస్టిక్ వ్యర్థాలను పరిశ్రమలకు విక్రయించడం ద్వారా మున్సిపాలిటీకి అదనపు ఆదాయం లభిస్తుంది. బయోమైనింగ్ ప్రక్రియ పనులు కొనసాగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం



ఇటీవల వరుసగా వర్షాలు కురవడంతో బయోమైనింగ్ పనులకు అంతరాయం ఏర్పడింది. డంపింగ్ యార్డులో షెడ్డు కూడా నిర్మించాల్సి ఉంది. వీటితో పాటు బయోమైనింగ్ మోటార్ ఏజెన్సీ నిర్వాహకుల వల్ల జాప్యం జరుగుతుంది. త్వరలో బయోమైనింగ్ ప్రారంభిస్తాం.

–శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, మోత్కూరు

అలైన్‌మెంట్ మార్చాలని తీర్మానం

- భువనగిరి మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం
- రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌పై చర్చ
- మార్పు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు

భువనగిరిటౌన్ : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్పునకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని భువనగిరి మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. గురువారం చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సంబంధించి ఒకే అంశంపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించచారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. గతంలో హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారికి, కాళేశ్వరం కాల్వలకు, యాదగిరిగుట్ట రోడ్డు విస్తరణలో రాయగిరి రైతులు భూములు కోల్పోయారని పేర్కొన్నారు. తాజాగా మరోసారి రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్నారని తెలిపారు. రాయగిరి పరిధి గుండా అలైన్‌మెంట్ మార్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

రీజినల్ రింగ్ రోడ్డు వల్ల ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో కౌన్సిలర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భువనగిరి నియోజకవర్గంలో వివిధ మండలాల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు పోతుందని, చాలా మంది రైతులకు ఉన్న కొద్దిపాటి భూమి కూడా మిగలడం లేదన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి సిఫారసు చేయాలని సూచించారు. అంతకుముందు చైర్మన్ చాంబర్‌లో రికార్డులను పరిశీలించారు. కాగా రీజినల్ రింగ్ రోడ్డుపై చేసిన తీర్మానాన్ని ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు చైర్మన్ ఆంజనేయులు తెలిపారు. సమావేశంలో కమిషనర్ నాగిరెడ్డి, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిలర్లతో సమావేశమైన ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

కూలీలకు సగటు వేతనం అమలు చేయాలి

● అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

సాక్షి,యాదాద్రి : ఉపాధిహామీ కూలీలతో నిర్దేశించిన ప్రకారం పనులు చేయించి సగటు వేతనం రూ. 272 వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఉపాధిహామీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలందరికీ పనులు కల్పించాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని సూచించారు. వేతనం గిట్టుబాటు కాకపోవడంతో చాలా మంది కూలీలు పనులకు దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. ఆ సమస్య రాకుండా చూడాలని సూచించారు. డీఆర్‌డీఓ నాగిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో కూలీలు చేయడానికి అనువైన పనులను గుర్తించి అడిగిన వారికి పనులు కల్పించాలన్నారు. అదే విధంగా పనులు పెండింగ్‌లో ఉన్న తెలంగాణ క్రీడా ప్రాంగణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. బృహత్ ప్రకృతి వనాల ఏర్పాటుకు అనువైన స్థలాలను గుర్తించి మొక్కల పెంపకానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వచ్చే హరితహారంలో మొక్కలు నాటడానికి స్థలాలు గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఏపీడీ శ్యామల, అన్ని మండలాల ఏపీవోలు, ఈసీలు ఉన్నారు.



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

వాసాలమర్రిలో అభివృద్ధి పనుల పరిశీలన

తుర్కపల్లి : సీఎం దత్తత గ్రామం అయిన తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిలో చేపట్టిన అభివృద్ధి పనులను గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణంతో పాటు మదిర గ్రామమైన రాంశెట్టిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల వివరాలను ఆయా శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో పారదర్శకత పాటించాలని, గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్, సర్పంచ్ పోగుల ఆంజనేయులు, మండల ప్రత్యేకాధికారి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ శ్యామ్‌సుందర్, డీఈలు శివకుమార్, గిరిధర్, డీపీఓ సునంద, ఎంపీఓ వెంకటేశ్వర్లు, కార్యదర్శి శ్రీనివాస్ ఉన్నారు.



వాసాలమర్రిలో అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

క్లుప్తంగా

గుట్టలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం



ఈఓ గీతారెడ్డికి స్క్రీనింగ్ మిషన్ గురించి వివరిస్తున్న రోటరీ క్లబ్ గవర్నర్ రాజశేఖర్‌రెడ్డి

యాదగిరిగుట్ట : పట్టణంలోని యోగానంద నిలయం సమీపంలో రోటరీ క్లబ్ ఆఫ్ యాదగిరిగుట్ట, భువనగిరి సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని రోటరీ క్లబ్ గవర్నర్ తాళ్ల రాజశేఖర్ రెడ్డి, యాదాద్రి ఆలయ ఈఓ జి.గీతారెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. మొదటి స్టేజీలో క్యాన్సర్‌ను గుర్తిస్తే తగ్గించే అవకాశం ఉందన్నారు. శిబిరంలో క్యాన్సర్ టెస్టును ఉచితంగా చేయడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా సుమారు 100మందికి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో భువనగిరి సెంట్రల్ అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, గుట్ట క్లబ్ అధ్యక్షుడు దీకొండ వెంకటేష్, అసిస్టెంట్ గవర్నర్ గడ్డం జ్ఞానప్రకాష్‌రెడ్డి, భువనగిరి సెంట్రల్ క్లబ్ కార్యదర్శి ఫకీర్ కొండల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు దిడ్డి బాలాజీ, కొమ్మిడి రవీందర్‌రెడ్డి, డాక్టర్ ఎడ్ల అనిల్‌రెడ్డి, ప్రశాంతి, సుమంత్‌రెడ్డి, డాక్టర్ రాజ్‌కుమార్, కోశాధికారి ఎండీ అనీఫ్ మేమన్, డైరెక్టర్స్ గుమ్ముల మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రావు, భువనగిరి ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఇటికాల లావణ్య, ఇన్నర్ వీల్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు జయశ్రీ, బండారు జయశ్రీ, యాదగిరిగుట్ట క్లబ్ సభ్యులు కైరంకొండ సుధీర్, జోగయ్య, వెంకటేష్, సుజాత, మల్లారెడ్డి క్యాన్సర్ ఇన్సిట్యూట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా సభ్యుడి అరెస్ట్

- రూ.7.92 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర



వివరాలు వెల్లడిస్తున్న భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర



స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను చూపుతున్న పోలీసులు

భువనగిరి: సింథటిక్ డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా సభ్యుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి డీసీపీ రాజేష్ చంద్ర తెలిపారు. గురువారం పట్టణంలోని డీసీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సయాన్ లహరి గోవాలో ఉంటూ గత మూడు సంవత్సరాల నుంచి మాదక ద్రవ్యాల వ్యాపారం చేస్తున్నాడు. ఇతడు గోవా రాష్ట్రానికే చెందిన ఎడ్మండ్ దిలీప్ నుంచి సింథటిక్ డ్రగ్స్ కొనుగోలు చేసి అక్కడే కొన్ని ప్రాంతాల్లో తక్కువ ధరలకు, మరికొన్ని ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. ఇటీవల గోవాలో డ్రగ్స్ వ్యాపారం సాఫీగా సాగకపోవడంతో ఖర్చులకు డబ్బులు లేక అతడు హైదరాబాద్‌లో నైట్ పబ్బుల్లో ఎక్కువగా డ్రగ్స్ వాడతారని తెలుసుకుని ఇక్కడ డ్రగ్స్ విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు హైదరాబాద్‌తో పాటు చౌటుప్పల్ ఏరియాలో గత ఆరు నెలల నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం చౌటుప్పల్ మండలంలోని తూప్రాన్‌పేట సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఇతరులకు డ్రగ్స్ సరఫరా చేయడానికి వచ్చిన సయాన్ లహరిని పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి రూ.3 లక్షలు విలువ చేసే నీలి రంగు డ్రగ్స్ మాత్రలు(60), రూ.2లక్షల విలువ చేసే పింక్ కలర్ డ్రగ్స్ మాత్రలు(40), రూ.1.80 లక్షల విలువ చేసే మాండి డ్రగ్స్ మందు, రూ.లక్ష విలువ చేసే 3.9 గ్రాముల కొకైన్, ఒక బ్యాగ్, రూ.10వేల విలువ చేసే స్మార్ట్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎడ్మండ్ దిలీప్ పరారీలో ఉన్నట్లు డీసీపీ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, మొత్తం ముఠాలో ఎంత మంది ఉన్నారో దర్యాప్తులో తేలుతుందని డీసీపీ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో చౌటుప్పల్ ఏసీపీ ఉదయ్‌రెడ్డి, సీఐలు మల్లికార్జున్‌రెడ్డి, మోతీరామ్, ఎస్సై లక్ష్మయ్య, పోలీసు సిబ్బంది అనిల్, పాండు ఉన్నారు.

అమెరికా వెళ్తాడనుకుంటే అనంతలోకాలకు..

- గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు
- చిలుకూరు గ్రామ శివారులో ఘటన



ఉదయ్‌కిరణ్ (ఫైల్)

చిలుకూరు: మరో 20 రోజుల్లో ఉన్నత చదువుల నిమిత్తం అమెరికాకు వెళ్లాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. బుధవారం అర్ధరాత్రి చిలుకూరు గ్రామ శివారులోని శివరాత్రి నగర్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామానికి చెందిన పొందూరి సత్తిబాబు కుమారుడు పొందూరి ఉదయ్‌కిరణ్(25)తో పాటు అదే గ్రామానికి చెందిన మారోజు శివ బైక్‌పై హుజూర్‌నగర్ వెళ్లి వస్తున్నారు. మార్గమధ్యలో చిలుకూరు గ్రామ శివారులోని శివరాత్రి నగర్ దగ్గరకు రాగానే బైక్‌ను వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్ వెనుక కూర్చున్న ఉదయ్‌కిరణ్ తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న శివకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఉదయ్‌కిరణ్ మృతదేహానికి కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించనట్లుగా ఎస్ఐ చల్లా శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మృతుడి తండ్రి సత్తిబాబు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడు ఉదయ్‌కిరణ్ బీటెక్ పూర్తిచేసి అమెరికాలో ఎంఎస్ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. రోడ్డు ప్రమాదం జరగకపోతే మరో 20 రోజుల్లో అమెరికాకు వెళ్లేవాడని కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఉదయ్‌కిరణ్ అకాల మరణంతో చిలుకూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బిక్కేరులో చెక్ డ్యాం నిర్మించాలని దీక్ష



దీక్షలో కూర్చున్న గ్రామస్తులు

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప బిక్కేరులో చెక్ డ్యాం నిర్మించాలని, మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ కొండగడప గ్రామస్తులు చేపట్టిన నిరాహార దీక్ష గురువారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. 9ఏళ్ల క్రితం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి గ్రామానికి విచ్చేసిన కేటీఆర్ బిక్కేరులో చెక్ డ్యాం నిర్మిస్తామని హామీ ఇచ్చారని, నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. పక్క గ్రామమైన వంగాల నుంచి పెద్దఎత్తున ఇసుక రవాణా జరుగుతుందని, ఇసుక రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. దీక్షలో కొప్పుల శ్రీధర్ రెడ్డి, ఎర్రబెల్లి యాదయ్య, తొంట తిరుపయ్య, వెంకట్‌రెడ్డి, భారతమ్మ, సోమనర్సయ్య, అంబటి పుల్లయ్య, పొన్నగాని యాదగిరి, శివరాత్రి నర్సయ్య, వరికుప్పల వెంకటి, శివరాత్రి ఎల్లమ్మ, ముత్తమ్మ, బుజ్జమ్మ, ఎర్ర మల్లమ్మ, యాదమ్మ, ఆగమ్మ, చెరుకు మధు, తదితరులు ఉన్నారు.

వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు.. ఆస్తి నష్టం



మునగాలలో తగులబడుతున్న గడ్డి మోపులు



రాయినిగూడెం శివారులో కాలిపోయిన బత్తాయి చెట్లను చూపిస్తున్న రైతు

రామగిరి(నల్లగొండ): ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని బత్తాయి తోట దగ్ధమైన సంఘటన తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం శివారులో గురువారం చోటు చేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి గ్రామానికి చెందిన రైతుల రెడ్డిపల్లి ఊశయ్యకు రాయినిగూడెం శివారులో 4.5 ఎకరాల బత్తాయి తోట ఉంది. గత ఐదు సంవత్సరాలుగా ఈ తోటను సాగుచేస్తున్నాడు. గురువారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని తోటలోని 30 బత్తాయి చెట్లు, 10జామ, మామిడి, కొబ్బరి చెట్లతో పాటు డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.2లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత రైతు తెలిపారు. అయితే తన తోట పక్కన రైతులు బొస్క నర్సింహ, తాడోజు బ్రహ్మాచారి తమ పొలంలో వరి కొయ్యలను తగలబెట్టడంతోనే మంటలు వ్యాపించి బత్తాయి తోట దగ్ధమైందని అనుమానిస్తూ బాధిత రైతు తిప్పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తిప్పలమ్మగూడెంలో వ్యవసాయ సామగ్రి..

అగ్నిప్రమాదంలో వ్యవసాయ సామగ్రి దగ్ధమైన ఘటన గురువారం తిప్పర్తి మండలంలోని తిప్పలమ్మగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. తిప్పలమ్మగూడెం గ్రామ శివారులో రైతు దేవిరెడ్డి నారాయణమ్మకు చెందిన వ్యవసాయ క్షేత్రానికి అనుకొని గురువారం ఉపాధి కూలీలు పనులు చేశారు. ఉపాధి కూలీలు చెత్త తగులబెట్టి ఇంటికి వెళ్లిపోయారు. మంటలు పక్కనే ఉన్న నారాయణమ్మ పొలానికి అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో పొలంలోని మూడు మోటారు స్టార్టర్లు, పైపులు కాలిపోయాయి. రూ.60వేల మేర నష్టం వాటిల్లిందని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపారు.

మునగాలలో 700 గడ్డి మోపులు..

మునగాల: ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని గడ్డి మోపులు దగ్ధమైన సంఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన తోట రాంబాబు ఇటీవల రూ.70వేల విలువ గల 700 గడ్డిమోపులను కొనుగోలు చేసి ఊరి చివరన తనకు సంబంధించిన ఖాళీ స్థలంలో గడ్డివాములుగా ఏర్పాటు చేసుకున్నాడు. అయితే గురువారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగి గడ్డిమోపులు కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చే లోపే గడ్డి మోపులు పూర్తిగా కాలిపోయాయని బాధితుడు తెలిపాడు.

ట్రావెల్స్ బస్సు బోల్తా

- క్షేమంగా బయటపడిన ప్రయాణికులు

కూసుమంచి: ఖమ్మం–సూర్యాపేట జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలో గురువారం తెల్లవారుజామున ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. ఖమ్మం నుంచి సూర్యాపేట వెళ్తున్న ఈ బస్సు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం దాటాక రహదారి నుంచి పక్కకు దూసుకెళ్లి బోల్తా కొట్టింది. అయితే, రహదారి పక్కన ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ రాళ్లను తాకి బస్సు ఆగడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 13 మంది ప్రయాణికులు ఉండగా ఒక మహిళకు మాత్రమే స్వల్ప గాయాలయ్యాయి. మోతె పోలీసులు కేసు నమోదు చేశారు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

చిలుకూరు: వడదెబ్బతో వృద్ధుడు మృతిచెందిన సంఘటన చిలుకూరు మండలం నారా యణపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపురం గ్రామానికి చెందిన కందుకూరి పెంటయ్య(75) కొన్ని రోజులుగా జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నాడు. దీనికి తోడు మూడు రోజులుగా ఎండలు మండిపోతుడడంతో వడగాల్పులకు అనారోగ్యానికి గురైన పెంటయ్య ఇంటి వద్దే చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడి భార్య సాయమ్మ కోరారు.

అదుపుతప్పి కాలువలో పడిన బైక్.. వ్యక్తి మృతి



కాలువలో బైక్‌తో పాటు లాలుసాహెబ్ మృతదేహం



రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పెద్దవూర: బైక్ అదుపుతప్పి కాలువలో పడటంతో వ్యక్తి మృతిచెందిన ఘటన పెద్దవూర మండలంలోని చింతపల్లి స్టేజీ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం పెద్దపాలెం గ్రామానికి చెందిన షేక్ లాలుసాహెబ్(50) ప్రతి ఏడాది సీజన్ వారీగా కుటుంబంతో కలిసి మండలానికి వచ్చి ధాన్యం తడవకుండా వేసే కవర్(పట్టాలు)లు అద్దెకు ఇచ్చుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ యాసంగి సీజన్‌లోనూ మండలంలోని నాయినవానికుంట స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద చిన్నపాటి గుడిసె ఏర్పాటు చేసుకుని రైతులకు పట్టాలు కిరాయికి ఇస్తున్నాడు. అదేవిధంగా నిడమనూరు మండలంలోని పార్వతీపురం గ్రామం వద్ద సైతం రైతులకు పట్టాలను అద్దెకు ఇస్తున్నాడు. బుధవారం సాయంత్రం లాలుసాహెబ్ బైక్‌పై పార్వతీపురం వెళ్లి పనులు చూసుకుని మంచం, కోళ్లను తీసుకుని నాయినవానికుంటకు తిరుగుపయనమయ్యాడు. మార్గమధ్యలో పెద్దవూర మండలంలోని చింతపల్లి స్టేజీ సమీపంలో జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై ఏఎమ్మార్పీ లోలెవల్ వరద కాలువ డిస్ట్రిబ్యూటరీ–8, 9పై ఏర్పాటు చేసిన వంతెన వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి పదిహేను అడుగుల లోతులో ఉన్న కాలువలో బైక్‌తో సహా పడిపోయాడు. దీంతో లాలుసాహెబ్ తలకు తీవ్రగాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. గురువారం ఉదయం వ్యవసాయ పనులకు అటుగా వెళ్లిన రైతులకు వంతెన కింద బైక్‌తో పాటు గుర్తుతెలియని మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పరిసర గ్రామాల ప్రజలు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడు పట్టాలు కిరాయికి ఇచ్చే లాలుసాహెబ్ అని గుర్తించి అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని లాలుసాహెబ్ మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. బుధవారం రాత్రి లాలుసాహెబ్ ఇంటికి రాకపోవడంతో పాటు ఫోన్ స్విచ్ఛాఫ్ కావడంతో.. పార్వతీపురంలోనే ఉండి ఉదయాన్నే వస్తాడులే అనుకున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఎస్ఐ పచ్చిపాల పరమేష్ ఘటనా స్థలానికి చేరుకుని బైక్, మృతదేహాన్ని స్థానికుల సహాయంతో కాలువ నుంచి బయటకు తీయించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ద్రాక్షాభి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కుక్క అడ్డురావడంతో..



గోవిందస్వామి (ఫైల్)

కోదాడరూరల్: కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి లైన్ ఇన్‌స్పెక్టర్ మృతిచెందిన ఘటన కోదాడ మండలం కాపుగల్లు రెవెన్యూ పరిధిలోని తొగర్రాయి సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలంలోని కూచిపూడి గ్రామానికి చెందిన మిర్యాల గోవిందస్వామి(56) మునగాలలో విద్యుత్‌శాఖలో లైన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. రోజుమాదిరిగా గురువారం కూడా విధులకు హాజరయ్యేందుకు అతడు బైక్‌పై వెళ్తుండగా కూచిపూడి–తొగర్రాయి సబ్‌స్టేషన్ రోడ్డులో బైక్‌కు కుక్క అడ్డు వచ్చింది. కుక్కను తప్పించబోయి ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో బైక్ అదుపతప్పి రోడ్డుపై పడటంతో గోవిందస్వామి ముఖం, తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం అతడిని కోదాడకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తీసుకెళ్లగా అప్పటికే అతడు మృతిచెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి

భువనగిరిటౌన్ : గిరిజనులు హక్కుల సాధనకు ఉద్యమించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రు నాయక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో గిరిజన సమస్యలపై పార్టీలకు అతీతంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనులకు 6శాతం నుంచి 10శాతం రిజర్వేషన్లు, హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో బంజారా భవన్‌ను సంపాదించుకున్న ఘనత ఏబీఎస్ఎస్‌లదే అని అన్నారు. జిల్లాలో ఉన్న గిరిజన ప్రజలను మేలుకొల్పడానికి, గిరిజన సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటుందని, త్వరలో జిల్లా కేంద్రంలో గిరిజన భవన్ ఏర్పాటు చేసుకోనున్నట్లు తెలిపారు. అనంతరం సంఘం జిల్లా కమిటీ ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కేతావత్ తిరుపతినాయక్, ఉపాధ్యక్షులుగా భానోతు బాలన్‌నాయక్, చక్రునాయక్, కార్యదర్శిగా ధరావత్ పాండు, చందు, కోశాధికారిగా కేవాతావత్ సుధాకర్, ఉద్యోగ కార్యదర్శిగా లకావత్ సురేష్, భానోత్ సోమాని, శ్రీనివాస్‌లను ఎన్నికయ్యారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతావత్ సోమ్లాల్‌నాయక్, నాయకులు మాన్యానాయక్, సురేష్, భిక్షపతి ఉన్నారు.

పంట మార్పిడితో అధిక లాభాలు

- వేర్వేరు పంటల సాగుతో పెరగనున్న దిగుబడి
- తగ్గనున్న చీడపీడల బెడద
- పెద్దవూర ఏఓ సందీప్ సూచనలు

పాడి పంట

పెద్దవూర: రైతులు వేసిన పంటలే మళ్లీ వేస్తూ బాగా నష్టపోతున్నారు. పంట మార్పిడి చేయకపోవడంతో చీడపీడల వ్యాప్తి ఎక్కువై దిగుబడి తగ్గుతుంది. భూమి సైతం నిస్సారంగా మారుతుంది. పంట మార్పిడి చేయడం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చునని మండల వ్యవసాయ అధికారి కె.సందీప్ సూచిస్తున్నారు. వేర్వేరు పంటలు సాగు చేస్తే రైతులకు దిగుబడి పెరగడంతో పాటు భూమిలో సారం పెరుగుతుందని, చీడపీడల బెడద తక్కువగా ఉంటుందని పేర్కొంటున్నారు. పంట మార్పిడికి సంబంధించి సూచనలు, సలహాలు ఆయన మాటల్లోనే..

పంట మార్పిడితో..

- నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది.
- భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుంది.
- చీడపీడలు దూరం అవుతాయి.
- ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గుతుంది.
- శిలీంధ్ర వ్యాధులను దూరం చేయవచ్చు.
- బీజాలు, వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి కూడా ఎక్కువగానే ఉంటుంది.



సాగవుతున్న మిరప పంట

- కీటకాల గుడ్లు వృద్ధి చెందకుండా చేసుకోవచ్చు.
- పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ఎక్కువగా పొందే అవకాశం ఉంటుంది.

పంటమార్పిడిలో తీసుకోవాల్సిన మెళకువలు

- పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటల్ని ఎంపిక చేసుకోవాలి. శనగ, బొబ్బెర, పెసర, మినుము వంటి పంటలను వేసుకోవడం వలన నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీనివలన కలుపు మొక్కలను నివారించవచ్చు.
- వరి తర్వాత మినుము, పెసర, వేరుశనగ, చెరకు వేయడం వలన సుడిదోమ, తుంగ్రో వైరస్‌ను నివారించవచ్చు.
- పత్తి సాగు చేసిన నేలలో మినుము, పెసర వంటివి వేయడం వలన తెల్లదోమ ఉధృతి తగ్గుతుంది.
- వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలి. దీనివలన వేరుశనగ పంటను ఆశించే ఆకుముడత ఉధృతిని తగ్గించవచ్చు.
- పసుపు తర్వాత వరి, జొన్న వంటి పంటలను సాగు చేసుకోవాలి. దీనివలన నేలలో నెమటోడ్ల సంఖ్య తగ్గుతుంది.
- నులిపురుగుల సమస్య అధికంగా ఉన్న ప్రదేశంలో వేరుశనగ, మిరప, పొగాకు, వంగ పంటలను కొంతకాలం పాటు తప్పనిసరిగా ఆపాలి.

ఇలా చేసుకోవచ్చు..

యాసంగిలో వేరుశనగ సాగు చేసిన రైతులు తర్వాత వానాకాలంలో మొక్కజొన్న పంట వేసుకుంటే పైరుకు కొంత నత్రజని లభిస్తుంది. దీంతో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. కంది, శనగ పంటలను వరుసగా వేస్తే కాయతొలుచు పురుగుల తాకిడి అధికంగా ఉంటుంది. అందుకే ఈ పురుగులు తక్కువగా ఆశించే జొన్న, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ, మెట్టవరి వంటి పంటలతో మార్పిడి చేసుకోవాలి. వరుసగా పొద్దుతిరుగుడు పంటను సాగు చేసే వారు కొర్ర, జొన్న, సజ్జ వంటి చిరుధాన్యాల పంటలను లేదా కంది, శనగ, మినుము వంటి అపరాల పంటలను లేదా వేరుశనగతో పంట మార్పిడి చేసుకోవచ్చు.

ధాన్యం పంటలతో ...

దోస, కాకర, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ వంటి తీగ జాతి కూరగాయల పంటలను వరి పైరుతో పంట మార్పిడి చేసుకోవాలి. ఉల్లిసాగు చేసే రైతులు ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. వరి, చెరుకు, అరటి, తమలపాకు, కూరగాయల పంటలతో పంట మార్పిడి చేసుకోవాలి. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులిపురుగుల ఉధృతి తగ్గుతుంది. మిరప, వేరుశనగ, క్యాబేజీ పంటలను ఆశించే లద్దె పురుగుల తాకిడి అరికట్టాలంటే జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలతో మార్పిడి చేయాలి.

ఎంపికలో జాగ్రత్తలు

పంట మార్పిడి చేయాలంటే అంతకు ముందు వేసిన పంటకు భిన్నంగా పెరిగే పంటను ఎంచుకోవాలి. కొన్ని పంటల వేరు వ్యవస్థలు నేలలోని పొరల నుంచి పోషకాలన్నీ ఎక్కువగా గ్రహిస్తూ ఉంటాయి. అపరాల పంటలు కరువు పరిస్థితులను తట్టుకుంటాయి. ఆకుల్ని రాల్చి భూమికి సేంద్రియ పదార్థాన్ని అందిస్తాయి. అపరాల పంటల మీద ఉండే బుడిపెలు వాతావరణంలోని నత్రజనిని స్థిరీకరిస్తాయి. సూక్ష్మజీవుల చర్య వల్ల ఎంజైముల ఉత్పత్తి పెరుగుతుంది. నల్లరేగడి నేలల్లో సోయాచిక్కుడు వేసుకుంటే పంట కోత సమయానికి ఆకులు పూర్తిగా రాలుతాయి. తద్వారా ఎకరానికి ఒకటి నుంచి రెండు టన్నుల సేంద్రియ పదార్థం లభిస్తుంది.

ఇలా చేయవద్దు..

పంట మార్పిడి చేసే సమయాలలో అనుకూలమైన పంటనే ఎంచుకోవాలి. లేదంటే చీడపీడల ఉధృతి ఎక్కువ అవుతుంది. బెండ తర్వాత పత్తి వేస్తే ఉపయోగం ఉండదు. ఎందుకంటే ఈ రెండు పంటలకు ఒకే రకమైన చీడపీడలు ఆశిస్తాయి. జొన్న వేసిన పొలాల్లో మిరప వేయకూడదు. పసుపు తర్వాత మిరప, టమాట, క్యాబేజీ, దోస, గుమ్మడి, సొర, బీర, పత్తి, ఆవాలు, బెండ వేసుకోకూడదు. ఆకుముడత ఆశించే ప్రాంతాల్లో వేరుశనగ, సోయాచిక్కుడు వేయకూడదు.